

సాయంత్రం కాలేజీనుండి తిరిగి వచ్చిన రాజా బట్టలు మార్చుకొని, వరండాపక్క తన గదిలో కూర్చొన్నాడు. ఆరు గంటలయింది. బయట సన్నగా జల్లు ప్రారంభమయింది. గాలిలేదు. లోపల ఉక్క పోస్తూంది. అతడిలో ఆలోచనలు ఇబ్బందిగా, అసహ్యంగా, చిరాగ్గా ఉన్నాయి.

చూడటానికి వచ్చిన ఎవరితోనో అమ్మ మాట్లాడుతూన్న మాటలు వినిపిస్తున్నాయి మధ్య మధ్య.

"మా శేఖరమా. . .వాడి కెక్కడ తీరిక ఉంటుంది? పొద్దున లేస్తే ఏవో వల్లమాలిన పనులు. ఏ ఛైర్మన్ గారో, కలెక్టరుగారో అర్జంటుగా కబురంపుతారు. అంతే. ఆ వెళ్ళటం ఏ అర్ధరాత్రో, అపరాత్రో గాని తిరిగి రాడు."

అమ్మ అన్నయ్యను గురించి ఇతరుల దగ్గర మాట్లాడే మాటలధోరణే మామూలు అయిపోయింది రాజుకు. కాని ఈనాడెందుకో భరించలేనంత చిరాకు పుట్టిస్తున్నాయి ఆమె మాటలు.

సాయంత్రం కాలేజీలో తెలుగు హెడ్‌గారన్న

# అన్నయ్య

## గంధం యాజ్ఞవల్క్యశర్మ

కన్న బిడ్డల క్షేమంకోసం, వారి సుఖ సంతోషాలకోసం ఎంతటి రంపపు కోత అయినా భరిస్తుంది తల్లి. గుండె చీల్చుకో గలదు తల్లి అవసరమైతే. అవమాన భారం ఎంతటిది అయినా వహిస్తుంది. కాని, ఆకన్న బిడ్డలలోనే ఒకరు మరొకరివల్ల మానసిక వేదనకు గురి అవుతూంటేమాత్రం ఆ తల్లి చూచి సహించలేదు.

మాటలు జ్ఞాపకానికి వచ్చాయి.

"రాజూ, మీ శేఖరం మరీ పాడవుతున్నాడోయ్. పొద్దున గాంధీ చౌకు దగ్గిర ఒకటే గోల. . . తప్ప తాగి ఉన్నాడు. చుట్టూ జనం. ఏదో నోటికి వచ్చి నట్లు మాట్లాడుతున్నాడు. అతన్ని అలా వదిలివేస్తే ఎలా? అంతేకాదు. ఈ ఊరిలో నీ గౌరవం, స్థానం, నీ భవిష్యత్తు అన్నీ మంట కలిసిపోతాయి. అతనిని అదుపులో పెట్టాలి."

ఎలా?

తెలుగు హెడ్ ఒక్కరే కాదు. . . ఎందరో శేఖరాన్ని గురించి తనతో చెబుతూనే ఉన్నారు. నెల రోజుల క్రితం సినిమాహాలులో గోల చేస్తున్నాడని తెలిసి వెళ్ళి తీసుకొని వచ్చాడు. అంతకు ముందు ఓసారి ఎక్కడో పడి పోయి ఉన్నాడని కాలేజీ విద్యార్థులు రిక్షామీద తీసు కొని వచ్చి ఇంట్లో వదిలిపోయారు.

"రాజూ! ఇంతవరకు నే నెలాగో సర్దివేస్తున్నాను కాని డిప్యూటీ వరకు వెళ్ళితే కష్టంరా..." అని తన నిస్సహాయత తెలియచేశాడు, సర్కిలు ఇన్‌స్పెక్టరు శ్రీనివాసరావు. తన చిన్ననాటి స్నేహితుడు శ్రీనివాసరావు.

నెల రోజుల క్రితం, సెలవునాడు, తానూ తోటి లెక్చరరు మంజులా సాయంత్రం షికారు వెళుతూంటే పార్కు ఇవతల గుంపుగా కూడిన జనం మధ్య స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. నీటుగా సూటు వేసికొని, నేలమీద వికృతంగా పడిపోయి ఉన్న శేఖరాన్ని చూచి గతుక్కుమన్నాడు. తన్నెవరూ అతని తమ్ముడుగా గుర్తించక ముందే, ముందుకు సాగిపోదామనుకున్నాడు క్షణకాలంపాటు. కాని. . . ఏదో బంధం, రక్తంలోని ఏదో శక్తి మూగగా తన్ను బంధించింది. రిక్షామీద శేఖరాన్ని తీసుకొని వస్తూంటే, ఆ జనంనుండి విని పించిన ఈలలకు, గోలకు తనమీద తనకే అసహ్యం వేసింది.

మంజుల ఏదో నీరసంగా చూచిందావాడు. తన కోసం స్టాఫ్ రూములో పడిగాపులు పడి ఎదురుచూచే మంజుల ఆనాటినుండి తనను తప్పించుకు తిరుగు తూంది.

"వాడి గదిపైన. . . ఎప్పుడూ ఏవో కాగితాలతో మునిగిఉంటాడు. సామాన్యంగా కిందికి రాడు" అంటూంది అమ్మ, చూడవచ్చినవారితో అన్నయ్యను గురించి.

కాగితాలు. . . హు! కాగితాలు కాదు. . . తప్ప తాగి మైకంలో ఉంటాడు పైన గదిలో. దానికి అమ్మ రంగుపూసి బట్టలు కడుతూంది.

చీకటి పడింది. జల్లు కొంచెం ఎక్కువయింది. చల్లటి గాలి జివ్వుమనేలా వీస్తూంది. కిటికీ పక్కనే కుర్చీలో కూలబడ్డాడు రాజు. లైటు వేసుకోవా లనిపించటం లేదు.

శేఖరం తనకంటే పది సంవత్సరాలు పెద్ద. తనకు బాగా గుర్తు. ఎంతో చలాకీగా, నీటుగా, ఆనందంగా ఉండేవాడు, విశాఖలో ఆనర్సు చదువుతూ ఉన్న రోజులలో. అప్పట్లో తాను హైస్కూల్లో చదువుతూ ఉండేవాడు. అన్నయ్య సెలవులకు వచ్చి నపుడు తన కెంతో ఉన్నతుడుగా కనిపించేవాడు. పై అంతస్తులోని వ్యక్తిగా అనిపించేవాడు. అస్తమానం ఏదో వ్రాసుకొంటూ ... పుస్తకాలు చదువుకొంటూ ... సిగరెట్లు కాలుస్తూ ఎంతో గంభీరంగా ఆలోచనా తమస్సులో మునిగి కనిపించేవాడు. ఎన్ని రకాల చిత్రా లను ఆయన గదిలో అలంకరించుకొనేవాడో! ఎన్నిసార్లు ఆ చిత్రాలను తదేకంగా చూస్తూ ఏవో లోకా లకు తేలిపోతూ అలా ఉండిపోయేవాడో! అలాంటి అన్నయ్య యూనివర్సిటీలో చదువు పూర్తి కాబోయే ముందు ఎలా మారిపోయాడు!

చదివిన చదువు సార్థకం కాలేదు. పచ్చి తాగుబో తయ్యాడు. అనాటికి తాను చిన్నవాడు. అన్నయ్య అలా ఎందుకయ్యాడో తనకు తెలియదు. అమ్మకు తెలుసేమో. . . ఆమె ఏనాడూ తనకు చెప్పలేదు. లోలోపల కుమిలిపోయేది. అంతే.

తనకు తెలియనివాడు ఏనాడో నాన్న గతించారు. ఆనాటినుండి అమ్మే సర్వస్వంగా పెరిగిన తనకు ఆమె అలా అన్నయ్య స్థితికి కన్నీరు మున్నీరు ఔతుంటే మనస్సు వికలమయ్యేది.

అన్నయ్యమీద కోపం వచ్చేది!

ఒక చేత్తో శిథిలమౌతున్న హృదయాన్ని పొదివి పట్టుకొని, మరో చేత్తో తనను నడిపించింది అమ్మ. కాలేజీ చదువు . . . యూనివర్సిటీ అధ్యాయం పూర్తి చేశాడు తాను. గాలి తాకిడికి ఊగిసలాడుతున్నా, తనకు నీడ నిచ్చిన ఆ మాతృవృక్షపు నీడన వ్యక్తుడయ్యాడు తాను. రీసెర్చి చేయటానికి అవకాశం వచ్చింది. మరో రెండు మూడు సంవత్సరాలు కష్టించి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసికొందామనుకొన్నాడు.

కాని అమ్మ అడ్డుపడింది.

కాదు, ఒకవిధంగా అన్నయ్య అడ్డుపడ్డట్లే.

"రాజూ! నీవు చదువంటూ దూరంగా వెళ్ళిపోతే నేనీ కుటుంబాన్ని ఈడ్చలేను నాయనా" అంది అమ్మ. ఆమె కనులలో నీరసించిన శక్తి కనిపించింది. అవును. ఆమె మానసికంగా, శారీరికంగా అలిసిపోయింది. వ్యక్తుడు పెద్ద కొడుకు కొరగాకపోగా ఆమెకు బరు వయ్యాడు.

పై అంతస్తుకు వెళ్ళవలసిన తన జీవితం అలా కింది మెట్టుమీదే ఆగిపోయింది. లెక్చరరయ్యాడు.

అనాడలా, ఈనాడిలా!

మంజుల సాహచర్యంతో పూలు పూయవలసిన జీవితోత్సాహం మళ్ళీ అన్నయ్య అనే ప్రతిబంధకంతో నలిగిపోతూంది.

కిటికీనుండి ఈదరగాలి కొరికివేస్తున్నట్లు బాధి స్తూంది, అతని మనసులోని ఆలోచనల్లా. కుటుంబ వ్యవస్థ తనమీద దాని మంచి చెడులను రుద్దు తూంది. తన యోగ్యతాయోగ్యతలతో, సంకల్పాలతో, ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఫలితాలను అను భవించవలసిందేనా! అంతే తా నశక్తుడవుతున్నాడు.

రాజుకు జ్ఞాపకానికి వచ్చాయి, పది రోజుల నాటి సాయంత్రం పార్కులో కనిపించి, మంజుల అన్న మాటలు.

"రాజూ! స్నేహానికి, వివాహానికి స్త్రీ పురుషు లిద్దరూ ఒకరి నొకరు ప్రేమించుకొంటేనే చాలదు. సాంఘికంగా వారి స్థితి గతులు, సంఘంలో వారి గౌరవ మర్యాదలు, వారి పరిసరాలు అన్నీ సవ్యంగా, సమంగా ఉంటేనే ఆ కలయికకు శోభ, ధన్యతాను కదూ!"

అలా అంటూ మంజుల నేలను చూస్తూ ఉండి పోయింది. ఆమె మాట్లాడింది అన్నయ్య నుద్దేశించి అని తనకు తెలుసు. ఆవేశానికి దూరంగా ఆలోచిస్తే మంజుల చెప్పింది నిజమేననిపిస్తూంది. ఆమెమాత్రం ఏమి చేయగలదు?. ఆమెకు తలిదండ్రులున్నారు. సంఘంలో గౌరవ మర్యాదలున్నాయి. ఆమెపట్ల వారి ఇష్టానిష్టాలు, నిర్ణయాలు ఉంటాయి. స్త్రీగా మంజుల ఆ రక్షణ నెలా తోసిరాజంటుంది?

పురుషుడై తానేం చేయగలుగుతున్నాడు? కుటుం బానికి బానిసై, రీసెర్చికి వెళ్ళకుండా నిలిచిపోలేదూ?

నేల విడిచి సాము చేయమని మంజుల కెలా చెప్ప టం? "రాజూ! నిన్ను మరిచిపోదామని కాదు. నీనుండి దూరమవ్వాలనీ కాదు. కానీ. . ." మంజుల మాట పూర్తి చెయ్యకుండానే నడిచిపోయింది తిన్నగా అక్కడనుండి.

మంజుల అలా వెళ్ళగానే చినుకులు ప్రారంభ మయ్యాయి, చిన్న తుంపర తుంపరగా. తాను తడుస్తూ ఉండిపోయాడు. ఆమెనూ తనతోపాటే తడుస్తూ నిలిచిపొమ్మని చెప్పటం ఎలాగ?

తన కదే భయం. ఆమె అలా నడిచి తన జీవితం నుండి కనిపించనంత దూరం వెళ్ళిపోతూ ఉంటే, తా నశక్తుడై వెనక్కు తీసుకొని రాలేకపోతాడేమో! ఆనాడు తన జీవితం అర్థంలేని, అసంపూర్తి వాక్యంలా మిగిలిపోతుంది.

## విజ్ఞప్తి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణకు ఉద్దేశించిన కథలు, కవితలు, నవలలు, చిత్రాలు—ఏవైనా ఈ దిగువ చిరునామాకు పంపవలసి ఉన్నది:

ఎడిటర్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మద్రాసు — 2

పోటీలకు ఉద్దేశించినవి అయితే కవరుమీద ఆ సంగతి స్పష్టంగా పేర్కొనవలసి ఉన్నది.

ఉత్తరాలు శీర్షికకు, 'జవాబులు' శీర్షికకు వ్రాసేవారు తమ పూర్తి చిరునామా ఇవ్వడం అవశ్యకం. లేకపోతే అలాంటి ఉత్తరాలను పరిశీలించడం సాధ్యంకాదు.

—ఎడిటర్

కృషెన్ సాల్టులు
తీసుకోండి
ఇవి
కీళ్ళ నొప్పుల
వలన బాధను
పోగొట్టును!




కృషెన్ సాల్టుల
7 విధముల పని
మిమ్ము స్వస్థతగా
నుంచును!

నికోలస్ వారి తయారు
నాణ్యతకు మరియు శుద్ధతకు మీకు గ్యారంటీ కలదు
KS G 2.TEL.

బయట పెద్ద బల్లొకటి విసిరింది. రాజా మనస్సు భయంతో ధ్వనించింది. కొన్ని క్షణాల తరవాత జల్లు ఆగిపోయింది. చెట్ల ఆకులనుండి నీటిచుక్కలు టప టపమంటూ కింద పడుతూ సన్నటి ధ్వని చేస్తున్నాయి. రాజా మనసు అలిసిపోయినట్లయింది.

మెట్లమీద చప్పుడు. చూడవచ్చినవారు వెళ్ళిపోతున్నట్లున్నారు. అమ్మ వాకిట నిలబడి రిక్షా ఎక్కుతున్న వారితో ఇంకా చెపుతూనే ఉంది—ఇంటి వాకిలికి, రోడ్డుమీదకు మధ్య అడ్డు ఉన్న మురుగుకాల్వమీద బండలు వేయించటాన్ని గురించి — "ఏదీ, మా శేఖరానికి వల్లమాలిన పనులు. క్షణం వాడికి తీరిక ఉంటేనా?" అంటూ. అన్నయ్యను అప్పటికో నిర్విరామ కార్యశూరుడైనట్లు చిత్రిస్తూంది.

హు! అసలాయనకు అక్కడో మురుగు కాలవ ఉందని తెలిస్తేగా? అలా తెలియాలే కాని, తప్ప తాగిన ఏ క్షణానో దానిలో జలకాలాడకపోయాడా!

"మా పెద్దవాడే ఇంటిపట్టున ఉంటే, ఏ చైర్మన్ గారికో ఫోను చేసి కారు తెప్పించేవాడే. పాపం చినుకుల్లో ఎలా వెడతారో. . ." అంటూంది అమ్మ.

చైర్మన్‌గారి కారు కాదు. పోలీసు వాన్ వచ్చేది! ఆమె అన్నయ్యమీద చేసే తప్పుడు ప్రచారం పట్ల అసహ్యం వేసింది రాజుకు.

అమ్మ ఎప్పుడు వచ్చిందో గదిలోకి. లైటు వేసింది. "అదేమిటిరా, దీపం లేకుండా కూర్చొన్నావు?" అంది.

రాజా మౌనంగా ఉండిపోయాడు.

మునిసిపాలిటీవారి సైరన్ కూసింది. అమ్మకు, తనకు మధ్య కొన్ని క్షణాలు మౌనం నిలిచిపోయింది.

"రాజా, వాడింకా ఇంటికి రాలేదు. వర్షం. . . పొద్దుననగా రెండు మెతుకులు తిన్నాడు. ఒక్కసారి వెళ్ళివస్తావా?"

రాజుకు ఉవ్వెత్తుగా కోపం ముంచుకువచ్చింది. "ఎక్కడ ఉన్నాడని?" గొంతు అదోలా ధ్వనించింది. మళ్ళీ రాజే అన్నాడు — "ఏ అర్ధరాత్రికో, అపరాత్రికో ఏ చైర్మన్‌గారి కారులోనో తిరిగి రాకపోడు."

"రాజా!" ఆమె గొంతు ఆవేదనలా ధ్వనించింది.

నిరసనగా ఆమెకేసి చూచాడు రాజా.

"ఏమిటిరా నీ వంటున్నది?" బాధగా ప్రశ్నించింది.

"ఏమంటున్నాను? నీ పెద్దబ్బాయి శేఖరం కీర్తికిరీటాన్ని శిరస్సుపై ధరించి, ఏ అర్ధరాత్రో ఈ గృహానికి వేంచేసి, ఈ ప్రాసాదాన్ని పునీతం చేసి, మన కీర్తిప్రతిష్ఠలను దశదిశలా వ్యాపింప చేస్తాడు అంటున్నాను. తప్పా?"

"రాజా! అన్నయ్యను గురించేనా నీ వీ మాటలంటున్నది?" నిరుత్తరురాలైనట్లు పలికింది.

రాజా అమ్మకేసి క్షణకాలం చూశాడు. అతనిలో బాధావీచికలు చెలరేగాయి. తాను బలి అవుతున్న అన్యాయాన్ని సహించలేనంత బాధ సుడులు తిరిగింది. అశక్తుడులా, విరాగిలా నిట్టూర్చి "అవునమ్మా. అన్నయ్యను గురించే. ఆయన కేం? సంఘం అంటే నిర్లక్ష్యం. నీతి నియమాలంటే చులకన. శరీరానికి బానిస. ఆయన స్వేచ్ఛా వ్యాపారి. ఆయన జీవితాన్ని సర్వనాశనం చేసుకొన్నాడు. అంతే కాదు. నా జీవితానికి, నా ప్రగతికి ఆయనో అడ్డుగోడ అయ్యాడు.

"ఆనాడు అలా రెచ్చిపోయి అవకాశాన్ని జారవిడుచుకొన్నాను. ఈనాడు జీవితంలో ఆత్మీయురాలు కావలసిన వ్యక్తికి దూరమవుతున్నాను. ఎందుకు నాకీ శిక్ష? ఆయనకు ఆలోచన లేదు అమ్మ, తమ్ముడు, వంశం, గౌరవం, సంఘం — ఏవీ లేవు. తాగుడు ఒక్కటే. ఆయన విలాసాలకు కాల్చే సిగరెట్టు కాలి, మాడి, బూడిదై రాలిపోతున్నట్లు నా జీవితం బలి అవుతూంది." ఆగిపోయి అమ్మ మోముకేసి చూశాడు రాజా.

ఆమె అచేతనలా గోడకు చేరగిలబడి కూర్చొని ఉండిపోయింది. రాజా కేసి చూస్తున్నట్లు లేదు. కనుల వెంట మూగగా జాలువారుతున్నాయి నీళ్ళు. క్షణకాలం తరవాత "నీ వంటున్న దేమిటో నా కర్థం కావటం లేదు, రాజా!" అని ప్రశ్నించినట్లు మాట్లాడింది.

"నాకూ అర్థం కావటం లేదమ్మా. అన్నయ్యను వదిలేయ్. నీవూ నాకీ అన్యాయం ఎందుకు చేస్తున్నావు? నీవు తల్లివి. నీకు నా ఎడల ఇలాంటి పక్షపాత బుద్ధి ఎందుకు ఉండాలి? అన్నయ్యలాంటి నిరర్థకుణ్ణి, తాగుబోతును, వ్యసనాల పుట్టను అందరి ముందూ ఆయనేదో నిర్విరామ కార్యసాధకుడులా, కుటుంబానికి వన్నెతెస్తున్న మహా నాయకుడులా చిత్రిస్తావు. అహర్నిశలు ఆయన తలపులతో, ఆయన అవసరాలు చూడ్డంతో మునిగిపోతావు. ఆయన సుఖ సంపత్తికోసం నన్ను, నా ప్రగతిని, నా వ్యక్తిత్వాన్ని విస్మరిస్తావు. ఏమిటీ అన్యాయం? ఈ కుటుంబ వ్యవస్థకు నే నెందుకు బానిస నవ్వాలి? అమ్మగా నాకీ అన్యాయం ఎందుకు చేస్తున్నావు నీవు? అదే ... అదే నమ్మా నా బాధ."

రాజా లేచి కిటికీగుండా చిమ్మ చీకటిలోకి చూస్తూ ఉండిపోయాడు. అతని మనస్సు వర్షించిన ఆకాశమైపోయింది.

"నీ కన్యాయం చేస్తున్నానా, రాజా!" భారంగా, సాలోచనగా గొణుక్కున్నట్లు వెలువడ్డాయి మాటలు.

రాజా వెనక్కి తిరిగి చూశాడు. అమ్మ ఎటో చూస్తూ తన జీవిత రహస్యాన్ని గురించి, తన హృదయంలో పెనవేసుకొని పోయిన మమత అనే చిక్కును గురించి మాట్లాడుతున్నట్లు మాట్లాడుతూంది.

"నాయనా, నీ కన్యాయం చేయాలని కాదు. నీ కన్యాయం చేస్తే ఈ జీవితానికి అర్థం ఏమిటి?"

వర్షిస్తున్న మేఘమయింది ఆమె.

"నాయనా, దయామయుడైన భగవంతుడు రెండు నేత్రాలలా శేఖరాన్ని, నిన్ను నాకు ప్రసాదించి, మీ బరువు బాధ్యతలను మోయవలసిన ఈ ఇంటి పెద్దను పట్టుకొని వెళ్ళాడు. ఎందు కలా చేశాడో? ఈ బ్రతుకు శకటాన్ని ఒంటిగా పూన్చి ఎన్నో గతుకులను, ఎన్నో బురదల గుంటలను దాటుకొంటూ సుదూర ప్రయాణాన్ని సాగించటానికి సిద్ధమయ్యాను. ఆ సుదూరంలో మీ ఉజ్జ్వల భవిష్యత్తు ఉందనే ప్రాణితో ఉండే ఉత్కంఠ, ఆశ నన్ను ప్రోత్సహించాయి.

"నాయనా, నాలోని రక్తాణువులలో ఒకదానిపట్ల ద్వేషం, మరొకదానిపట్ల కారుణ్యం ఎలా ఉంటాయి? అలాగే నీవూ, శేఖరం. బిడ్డలుగా మీ రిద్దరూ ఒకటే నాకు. మీ ఇద్దరిలో ఎవరిదైనా బాధ అది నాదే.

"చూడు, రాజా. నీ కన్యాయం చేస్తున్నానని కదూ

అంటున్నావు? నా రెండు నేత్రాలలో ఒక నేత్రం పాడయిపోయింది. రెండవదానిని ఉపయోగించుకొని ఈ లోకాన్ని చూస్తున్నాను. అదే నేను చేస్తున్నది.

"నీ బాధ నాకు తెలుస్తూంది, నాయనా. నేను అన్నయ్యపట్ల అతి శ్రద్ధ చూపుతూ, వాడికి ఎనలేని ప్రచారం చేస్తూ, నీకు న్యాయంగా ఉన్న స్థానాన్ని కూడా గుర్తించటం లేదని కదూ? కాదు, రాజా! కాదు. కుటుంబంలో ఒక అవిటివాడో, రోగగ్రస్తుడో ఉంటాడు. అతని బ్రతుకు బాధ్యతపట్ల తల్లికి ఉండవలసిన శ్రద్ధ నాది. అన్నయ్య జీవితం బయటకు మరోలా కనిపించినా, అవిటిదే.

"నీకుతెలియదు, నాయనా. నీ అన్నయ్య జీవితంలో తీరని దగా జరిగిపోయింది. వాడేది ప్రాణమనుకున్నాడో ఆ వ్యక్తి పరాధీన అయింది. ఉజ్జ్వలం కావలసిన వాడి జీవితం కుళ్ళిపోవటం ప్రారంభించింది. నేనేం చేయగలను? అశక్తురాలిని. పరిపూర్ణుడు కావలసిన కొడుకును ఊహించుకొని, అలాంటివాడిని సృష్టించుకొని, పగులువారుతున్న నా తల్లి ఆశలకు రంగు పూత పూసికొంటూ జీవిస్తున్నాను.

"నిన్ను లోకం దృష్టిలో ఉన్నతుణ్ణి చేయ నక్కర లేదు. సత్యంలా నీకు నీవుగా ప్రకాశిస్తావు. నా ఆవేదన, శ్రమ కూలిపోతున్న అన్నయ్యను నలుగురి మధ్య నిలవపెట్టాలనే. అంతే, రాజా! అంతే. నన్ను నమ్ము. నేను నీకు అమ్మను. నీ అన్నయ్యకూ అమ్మను. నన్ను అర్థంచేసుకో, నాయనా!"

ఆమె తడిసిన శిల అయిపోయింది. రాజు అమ్మకేసి చూస్తూ స్థాణువులా మిగిలిపోయాడు. అమ్మ హృదయం ఎంతటి అగ్నిగుండం!

బయట మురికి కాలవ గట్టు దగ్గర ఏదో భళ్ళుమన్న శబ్దమయింది. అమ్మ గుభుక్కున లేచి వెళ్ళింది, వర్షపు జల్లు చీల్చుకొంటూ. రాజా అనుసరించాడు. మురికి కాలవ పక్కన శేఖరం. అమ్మ హృదయం మూగగా మూగుతూంది. రాజు హృదయం ఒక్కసారి ఊగిసలాడింది. అమ్మపట్ల జాలి, దహించుకొనిపోతున్న కరుణ.

అన్నయ్యను అమ్మ ఆసరాతో మెట్లమీదుగా పైగదిలోకి చేర్చి ఒక్క క్షణం అక్కడ ఉండలేక దిగి వచ్చాడు తాను. తనకు కిందికి వినవస్తున్నాయి మైకంలో అన్నయ్య పిచ్చిగా ఏదో మాట్లాడటం, అమ్మ ఆయన నోరునొక్కి గొడవ చేయవద్దని బ్రతిమిలాడటం, కనుల నీటితో దీనంగా మాట్లాడటం; అవన్నీ అన్నయ్యపట్ల వృథా అవటం.

వినిపిస్తూంది ఆమెలోని పుత్రేషణ.

రాత్రి పది గంటలకు దిగి వచ్చి తనకు భోజనం పెట్టింది. మౌనంగానే ముగించాడు తాను. అన్నయ్య కోసం పళ్లెంలో పెట్టుకొని పైటచెరగువారన తీసుకొని వెళ్ళింది పైకి. మరి తన సంగతే ఆలోచించుకొని ఉండదు.

అది మాతృహృదయం!

రాజులో ఆలోచనలు గుబులుగా ఉన్నాయి. బయట వర్షం తగ్గలేదు. కిటికీగుండా జివ్వుమనే గాలి వీస్తూంది. వేలాడుతూన్న ఎలక్ట్రిక్ దీపం గాలి తాకిడికి కదలాడుతూంది. కాని, ఆరిపోవటం లేదు.

అమ్మ హృదయంలా అనిపించింది రాజుకు. అతని మనస్సు భారమయింది. బాధగా సుడులు తిరిగింది. మూగగా నిద్ర పట్టింది చాలా పొద్దు పోయాక.

● ● ● ●

తెల్లగా తెల్లవారింది.

కులగిరులు విరిగి నేలకూలినట్లు అన్నయ్య శేఖరం వచ్చి, "రాజూ!" అంటూ కేకవేసి తన మంచంమీద వాలిపోయాడు.

తాను నిరుత్తరుడయ్యాడు. ఈమధ్య మనస్సు తెలిసిన స్థితిలో ఏనాడూ తనకు మోము చూపని అన్నయ్య ఖిన్నుడై తన ముందు!

"రాజూ, ఇక తాగను. ఏనాడూ తాగను, రాజూ!" ఆవేదనను ముద్దచేసి కన్నీటితో అర్పణ చేస్తున్నట్లున్న శేఖరం.

"ఏమిటి, అన్నయ్యా, ఏమిటి?" రాజా ప్రశ్నించాడు.

శేఖరం చేతిలోని కాగితాన్ని రాజుకు అందించి, "అమ్మ. . . అమ్మ, రాజూ! అమ్మ కావాలి నాకు" అంటూ పెనవేసికొన్నాడు రాజును.

రాజుకు అంతా అయోమయమయింది. జాబు విప్పాడు.

"శేఖరం!

నేను వెళ్ళిపోతున్నాను. ఇన్నాళ్ళూ నీవు మామూలు మనిషిగా మారతావనే ఏదో ఆశ నన్ను మాయ చేసింది. ఆ మబ్బు తెరలాంటి నమ్మకంలో ఉండిపోయాను. ఆ ముసుగులో ఉండిపోయిన నేను నీపట్ల తల్లిగా బాధ్యతను నెరవేరుస్తున్నాననుకొంటూ, రాజుకు అన్యాయం చేస్తున్నానని గ్రహించలేకపోయాను.

నీకు జీవితంలో గాయం అయింది. దానికి తల్లిగా నా సానుభూతి, బాధ ఉన్నాయి. కాని, దాని కారణంగా మరొకరి జీవితాన్ని బలి ఇవ్వటం న్యాయం కాదుగా?

రాజా జీవితాన్ని గురించి ఒక్కసారి ఆలోచించు. వాడికేం తక్కువ? చదువు, తెలివితేటలు ఉన్నాయి. ఆనాడే వాడు రీసెర్చికి వెళ్ళిఉంటే ఎంతో ఉన్నతుడై ఉండేవాడు. వాడు న్యాయంగా అంది పుచ్చుకొనవలసిన ఆ మహత్తరావకాశం ఎందుకు జారవిడవబడ్డది?

తల్లిగా రాజా ప్రగతికి అడ్డు నిలిచిన బాధ్యత నా దెంత?

సంఘంలో యోగ్యుడైన కాలేజీ లెక్చరర్‌గా వాడికి ఉండతగిన గౌరవ మర్యాదలు నానాటికి ఎందుకు బుగ్గవుతున్నాయి?

ఈనాడు రాజా మనసారా ప్రేమించిన వ్యక్తి వాడి చుట్టూ ఉన్న దేనిని చూసి దూరంగా తొలగిపోవటానికి సిద్ధమౌతూంది? ఇవన్నీ తెలిసి, నీకు న్యాయం చేస్తున్ననే భ్రమలో ఎలా ఉండిపోగలను, నాయనా?

రాజా హృదయం భగ్నమై, వాడి జీవితం వాడిపోయి, విస్మారమైతే నా ఈ జీవితానికి అర్థం ఏమిటి?

ఆలోచించాను, శేఖరం. దీని కంతకూ కారణం ఆలోచించాను. నేను . . . నే ననే ఈ వ్యక్తి దూరంగా తొలగిపోతే, నీ బ్రతుకు బాధ్యత నీది. అమ్మగా నీకు నేను చేసిన మే లేమిటి? అందుకే దూరంగా వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో స్పష్టంగా నాకూ తెలియదు.

నేను చూడకపోయినా, నా కోరిక నీవు మనిషిగా మారాలి. రాజా, నీవు ఈ సంఘంలో ఉన్నతులుగా సుఖసంపత్తితో వర్ధిల్లాలి. ఈ కోరిక నేను నీ చెంతనుండగా తీరేది కాదు. అందుకే ఆ భగవంతునికి మీ ఇద్దరిని వదిలి పోతున్నాను.

ఆ దయామయునికి నా ప్రార్థన ఒక్కటే — ఈ భూతలిమీద మరెట్టి మాతృహృదయాన్ని సంఘం అంటే లక్ష్యంలేని, నీతినియమాలను కుటుంబ వ్యవస్థను వంశగౌరవాన్ని చులకన చేసే సంతానాన్ని ఇచ్చి బాధించవద్దని; తాగుబోతుకాని కొడుకు నివ్వమని.

ఈ ప్రార్థన చేస్తూ వెళ్ళిపోతున్నాను, శేఖరం!

ఆశీర్వచనాలతో—

నీ అమ్మ."

జాబు ముగించి రాజా శేఖరానికేసి చూశాడు ఆందోళనగా.

తాను చేసిన పాపానికి ప్రపంచం మండిపోతూ ఉంటే ఖిన్నుడౌతూన్నవాడిలా క్రుంగిపోతూ శేఖరం.

వేదనను మోయలేక కూలిపోతూన్నట్లున్న అన్నయ్య, "రాజూ, అమ్మ కావాలి నాకు. మరెప్పుడూ తాగను.



కలికాల భైరవ

చిత్రం—ఎస్. విఠల్‌రావు (బెంగుళూరు—౨)

అమ్మతోడు, తాగను" అన్నాడు.

గాలి, ఎండ, వానలనుండి తనను అహర్నిశలూ రక్షించిన రమ్య హర్మ్యానికి నిప్పు పెట్టుకొని, నిరాశ్రయుడైన అన్నయ్య.

"అమ్మ లేని ఈ ఇల్లు చీకటి కూపం, రాజా!" దీనంగా అశక్తుడిలా మౌనంగా దుఃఖిస్తున్న శేఖరం.

చేజేతులా నేలపాలు చేసుకొన్న అమృతభాండాన్ని చూసుకొని విలపిస్తున్న వ్యక్తిలా, కావాలని కరదీపిక ఆర్పివేసుకొని దిక్కు తెలియక అలమటిస్తున్న పాంథునిలా అన్నయ్య.

రాజా అయోమయంగా బయటకు చూశాడు. బయట వర్షం వెలిసింది. ఈదరగాలి తగ్గింది.

'అమ్మ కావాలి. అవును. అమ్మలేని ఈ గృహం చీకటి కూపం. అన్నయ్య మారిపోతాడు. అమ్మ వెళ్ళదు.' గొణుక్కున్నట్లు బయటకు నడిచాడు రాజా.

పైకి వస్తూన్న సూర్యుని పైడి కిరణాల నంటిపెట్టుకొని రాజా, శేఖరం అమ్మకోసం బయలుదేరారు. ★